అది చలికాలం. ఆ ఏడు చలి ఎక్కువగా వుంది. కుక్కి మంచంమీద పడుకున్న ప్రకాశం మాష్టారు ఆ చలికి తట్టుకోలేక అంతకంతకూ ముడుచుకు పోతున్నారు. ఆ చలిబారి నుండి కాపాడుకోడానికి వెచ్చటి రగ్గుగానీ, మంచి దుప్పటిగానీ ఆయనకు లేవు. తను కప్పుకున్న చిరుగుల దుప్పటినే మరింత బిగదీసి కప్పుకుని పడుకున్నారు. కాసేపటికి ఎప్పుడో ఆయనకి తెలీకుండానే కునుకు పట్టేసింది.

ఎంతసేపు అలా నిద్రపోయారోగానీ-తను కప్పుకున్న దుప్పటి చిరుగుల్లోంచి చిరుగాలి రివ్వున దూసుకొచ్చి ఆయన శరీరాన్ని వణికించే సరికి ఆయనకి హఠాత్తుగా మెలకువ వచ్చేసింది. అబ్బ! వెధవ చలి...చంపేస్తోంది. త్వరలో ఎలాగైనా ఓ మంచి దుప్పటి కొనుక్కోవాలి అనుకున్నారాయన.


అప్పుడే పెద్ద దగ్గుతెర వచ్చింది ఆయనకు. దగ్గి దగ్గి ఆయాసంతో రొప్పుతూ- "ఈ దగ్గొకటి నా ప్రాణం తీయడానికి" అని విసుక్కుంటూ తలుపు తీసుకుని బయటికి వచ్చారు. ఇంకా తెల్లవారలేదు. తూర్పు దిక్కున సూర్యోదయానికి గుర్తుగా ఎర్రటి వెలుగులు అలుముకుంటున్నాయి. మెల్లగా నడుచుకుంటూ గోడ వారకు వెళ్ళి అక్కడ కాండ్రించి ఉమ్మి, మళ్ళీ తిరిగొచ్చి పక్కమీద పడుకున్నారు. కానీ ఎంతకీ నిద్రపట్టలేదు. ఏవేవో ఆలోచనలు ముసురుకున్నాయి. తన గర్భ దారిద్ర్యం గుర్తుకొచ్చింది.

అంతలో మెల్లి మెల్లిగా తెల్లవారింది. వెలుగు అంతటా వ్యాపించి, కిటికీలోంచి దూరి మాష్టారినీ, అంతకంటే దైన్యావస్థలో వున్న ఆ ఇంటినీ తాకింది. ఆ వెలుగులో మాష్టారు తనవంక ఒకసారి, శిథిలావస్థలో వున్న తన ఇంటికేసి ఒకసారి పరిశీలనగా చూసుకుని గాఢంగా నిట్టూర్చారు.

వాడిపోయిన మొహం, లోతుకు పోయిన కళ్ళు. వయసు మళ్ళకముందే వృద్ధాప్యం ఆవరించాలని తొందర పడుతున్నట్టుగా చర్మంమీది ముడతలు అన్నీ కలిసి మాష్టారి రూపాన్ని వికృతంగా మార్చేశాయి. అసలు ఒంట్లో రక్త మాంసాలు వున్నాయో, లేవో నన్నట్టుగా కృంగి కృశించి పోయింది ఆయన శరీరం.

ఆయన వుంటున్న ఆ ఇల్లు కూడా పాగ మారినట్టు నల్లబడిపోయి పెచ్చులూడిపోయి ఎముకలు దేలిన మనిషిలా వికృతంగా వుంది. ముట్టుకున్న చోటల్లా గోడ పెళ్ళలు పెళ్ళలుగా విరిగిపడే ఆ ఇల్లు ఇవ్వాలో, రేపో కూలిపోయే స్థితిలో వుంది.

అయినా సరే, ఆ ఇల్లంటే ప్రాణం మాష్టారికి. తన తాత, తండ్రి, తాను పుట్టి పెరిగిన ఇల్లది. తన తాత కాలంలో ఇల్లంతా ధన ధాన్యాలతోను, వెండి బంగారాల తోను నిండి వుండేవట. తన తండ్రి హయాం వచ్చేసరికి అవన్నీ హరించుకు పోయాయి. కానీ ఎప్పుడూ ఇంటినిండా మనుషులు తిరుగుతూ వుండేవారు. వచ్చే పోయేవారితో ఒకటే సందడిగా వుండేది. ఇంటి బయట



# స్మారక చిహ్నం

—శ్రీకంఠమూర్తి

మున్న విశాలమైన అరుగుమీద ఎన్నో సభలు, సమావేశాలు జరుగుతూ వుండడం తనకింకా లీలగా గుర్తుంది.

కాలేజీలో చదివే రోజులలోనే ఆదర్శ వాదిగా పేరుపొందిన తన తండ్రి కేశవరావు దేశ స్వాతంత్ర్యోద్యమంలో పడి తన సర్వస్వాన్ని దాని కోసం ధారపోశాడు.

స్వాతంత్ర్య పోరాటం, హరిజనోద్ధరణ అంటూ ఎప్పుడూ పది మందిని వెంట బెట్టుకుని తిరుగుతూ తన స్వంత ఖర్చుతో అవన్నీ నడిపించేవాడట తండ్రి. పైగా ఎప్పుడూ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సభలు జరిపేవాడు కాబట్టి లెక్కలేనన్నిసార్లు జైలుకు వెళ్ళాడట. కానీ ఆయన విడుదలై వచ్చిన ప్రతిసారీ ఊరి ప్రజలంతా ఊరి మొగలో చేరి, పూలతో అలంకరించిన జోడెడ్ల బండిమీద ఆయనను ఊరేగిస్తూ ఊళ్ళోకి తీసుకొచ్చేవారట. తన తల్లి అవన్నీ గుర్తు చేసుకుంటూ వుంటుంది ఎప్పుడూ.

తండ్రి జ్ఞాపకాలతో ఒళ్ళు పులకరించినట్లయింది ప్రకాశం మాష్టారికి. అలాంటి మహానుభావుడూ, గొప్ప త్యాగమూర్తీ జన్మించిన ఈ ఇల్లు ఇప్పుడు తనది అన్న ఆలోచన రాగానే ఎంతో గర్వంగా అనిపించింది. ఓసారి గదంతా కలయచూసి ఎంత కష్టమైనా సరే ఈ వేసవి కాలంలోనైనా ఇల్లు తప్పకుండా బాగు చేయించాలి అనుకున్నారు ప్రకాశం మాష్టారు. ఇప్పటికైనా బాగు చేయించకపోతే ఇక ఈ ఇల్లు నిలవదు. ఎప్పుడో అప్పుడు కూలిపోతుంది. తరువాత తలదాచుకోడానికి ఒక నీడ కూడా లేకుండా పూర్తిగా గతిలేని వాళ్ళయిపోతారు తామంతా అని కూడా అనుకున్నారు. ఈ ఆలోచన రాగానే ఆయనకి భయంతో ఒళ్ళు గగుర్పొడిచింది.

"మీరు నమస్కారం అన్నా ఆవిడ జవా బివ్వదే?" వాసంతిని అడిగింది నీల.

"ఆమె! మా పక్కింటావిడే! ఏం తీసు కున్నా తిరిగి ఇచ్చే అలవాటు ఆమెకు లేదు"!

అంతలో ఏదో కారు వచ్చి ఇంటిముందు ఆగినట్టు కాగానే ఆయన ఆలోచనా ప్రవంతికి ఆనకట్ట పడింది. లేచి కిటికీలోంచి చూశారు. ఒక పెద్ద కారు తన ఇంటిముందే ఆగివుంది. ఇంత పెద్ద కారులో తన ఇంటికి వచ్చినవారెవరా? అని కుతూహలంగా చూస్తూ వుండగానే ఆ కారు డ్రైవరు తల బయటికి పెట్టి "ప్రకాశం మాష్టారిల్లు ఎక్కడో తెలుసాండీ?" అని కిటికీలోంచి చూస్తున్న మాష్టారినే అడిగాడు.


మాష్టారు ఆశ్చర్యంలో మునిగిపోయారు. అయినా వెంటనే తేరుకుని "ఇదే ఇల్లు. నేనే ప్రకాశాన్ని... రండి...రండి" అనేసి ఒక్క ఉదుటున పక్క గదిలోకి వెళ్ళి తన ఒంటిమీదున్న చిరుగుల దుప్పటిని విసిరి పారేసి తొడుక్కున్న పాత స్వెట్టర్ని ఆదరా బాదరాగా లాగిపడేసి కొత్త శుభ్రంగా వున్న చొక్కా తొడుక్కుని బయటికి వచ్చారు ప్రకాశం మాష్టారు.

ఈలోగా డ్రైవరు తలుపు తీయగా కారులోంచి ఒక పెద్దమనిషి దిగి ఇటే రాసాగాడు. ఖరీదైన దుస్తులు ధరించిన ఆ వ్యక్తి మెడలో బంగారు గొలుసు, వేళ్ళకు పెట్టుకున్న పెద్ద పెద్ద రవ్వల ఉంగరాలు, చేతికున్న బంగారు రిస్ట్ వాచి, కళ్ళకు పెట్టుకున్న బంగారు ఫ్రేము కళ్ళజోడు-అన్నీ చూసేవారి కళ్ళు కుట్టేలా ఎండలో జిగేల్మని మెరుస్తున్నాయి. 'అష్టదరిద్రంలో మగ్గుతున్న ఈ కుచేలుడి ఇంటికి వచ్చిన ఈ కుబేరుడెవరై వుంటారబ్బా' అని మనసులో ఆలోచిస్తూనే పైకి "దయచేయండి...దయచేయండి" అన్నారు మాష్టారు వినయంగా.

ఆ వచ్చిన వ్యక్తి నవ్వుతూ "దయచేయడమేమిటోయ్...రారా అను. నేనెవర్నో గుర్తుపట్టలేదా? బాలూనిరా! మీ నాన్నా, మా నాన్నా ఎంత స్నేహితులో, నువ్వూ-నేనూ చిన్నప్పుడెలా కలిసి తిరిగేవారమో మరచిపోయావా?" అన్నాడు అక్కడే అరుగుమీద చతికిలపడుతూ.

"అరెరె...ఆ బాలూనా నువ్వు?" నమ్మలేనట్టుగా చూశారు ప్రకాశం మాష్టారు. తన తండ్రీ, బాలూ తండ్రీ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య యోధులు నిజమే. కానీ తన స్థితికీ, అతనున్న స్థితికీ ఎంత వ్యత్యాసం? తన తండ్రి దేశం కోసం ఉన్నదంతా అర్పించి, తమను నిర్భాగ్యుల్ని చేసిపోతే, అతని తండ్రి బోలెడంత కీర్తినీ, మంచి పదవినీ సంపాదించుకుని తన కొడుకుని సకల సంపన్నుడ్ని చేసిపోయాడు.

అంతలో బాలూ అనే బాలగంగాధర తిలక్ మాట్లాడడం మొదలెట్టాడు.



"మీ నాన్నగారు కేశవరావుగారి శత జయంతి ఉత్సవం జరపాలని నిర్ణయించిందిరా మా అసోసియేషన్. ఈ ఉత్సవం కోసం ప్రత్యేకంగా కేశవరావు స్మారక కమిటీ ఒకదాన్ని కూడా ఏర్పాటు చేశాం. దానికి నేనే అధ్యక్షుడ్ని. నేను ఒక ప్రభుత్వ కార్పొరేషన్‌కి ఛైర్మన్‌గా వున్నాను తెలుసా. వచ్చే నెల ఇరవైయవ తేదీ కదూ! మీ నాన్నగారి జన్మదినం. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని శతజయంతికి ఉత్సవం జరపాలని మా సంకల్పం. మా అసోసియేషన్ వుండేది ఇలాంటి వాటికోసమే. దేశం కోసం తన సమస్తం అర్పించిన ఆ మహనీయుడి జ్ఞాపకార్థం ఆ మాత్రం చేయకపోతే ఎలా? అందుకని ఆ ఉత్సవంలో పాల్గొనడానికి నువ్వు రావాలి. కారు పంపిస్తాను. తప్పకుండా వస్తావు కదూ!"

ప్రకాశం మాష్టారు లోలోపల ఆశ్చర్యపోయారు.

"తన తండ్రి జన్మదినం తనకంటే ఇతరులకే బాగా గుర్తుందన్న మాట" అనుకున్నారు మనసులో. పైకి మాత్రం "ఎంతమాట తప్పకుండా వస్తాను. మా నాన్నగారి శత జయంతి ఉత్సవానికి నేను రాకుండా వుంటానా" అన్నారు సంతోషంగా.

"ఇక నేవెళ్ళొస్తా. నువ్వు తప్పకుండా వచ్చేయ్" అంటూ గభాలున లేచి కారుకేసి నడిచాడు బాలు. అతను కూర్చోగానే కారు దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది.

తన తండ్రి శతజయంతి ఉత్సవాన్ని అంత ఘనంగా జరుపుతున్నారంటే దానికోసం ఒక పెద్ద మనిషి స్వయంగా వచ్చి తనను ఆహ్వానించాడంటే తన తండ్రి ఎంత గొప్పవాడో అర్థమవుతుంది. ఆ తండ్రి కొడుకైన తనకు ఆ ఉత్సవంలో పాల్గొనడం కంటే సంతోషం ఇంకేముంటుంది?

ప్రకాశం మాష్టారు ఆత్రంగా ఎదురు చూసిన ఆ శుభదినం రానే వచ్చింది.

బాలు చెప్పినట్టుగానే కారు వచ్చి మాష్టారి ఇంటి ముందు ఆగింది. ఉన్నంతలో కాస్త మంచి బట్టలు ధరించిన ప్రకాశం మాష్టారు దర్జాగా వెళ్ళి కారులో

"కారు కొన్నప్పుడు ఏడాదిలోపు ఏ పార్ట్ పోయినా కొత్తది వేస్తానని గ్యారంటీ ఇచ్చారు కదూ?" అడిగాడు డీలర్‌ని ప్రసాద్.

"అవును. నిజమే ఇప్పుడేం పార్ట్‌లు పోయాయి" అన్నాడు డీలర్.

"ఓ వెయ్యి, నాలుగు ముందు పళ్ళు" చెప్పాడు ప్రసాద్.

కూర్చున్నారు. కారు తిన్నగా బాలగంగాధరతిలక్ ఇంటికి వెళ్ళింది. అక్కడ కుశల ప్రశ్నలు, ఫలహారాలు పూర్తయ్యాక ఉత్సవం జరిగే చోటుకు చేరుకున్నారు ఇద్దరూ. తండ్రులిద్దరూ దేశభక్తులు కావడంతో తనకు టంగుటూరి ప్రకాశం పంతులుగారి పేరునూ, బాలూకి బాలగంగాధరతిలక్ పేరునూ పెట్టారట.

సభా ప్రాంగణంలోకి వెళ్ళగానే అక్కడ అలంకరణ, ఆడంబరాలూ చూసి దంగయిపోయాట ప్రకాశం మాష్టారు. జిగేల్‌మంటున్న లైట్ల కాంతిలో మెరిసిపోతున్న తన తండ్రి నిలువెత్తు చిత్రపటాన్ని చూసి ఆయన నోరు తెరిచారు. "ఇంత ఆరోగ్యంగా వుండే వాడా తన తండ్రి? ఏమో...ఆయన్ను అలా చూసిన జ్ఞాపకాలు మచ్చుకైనా లేవు తనలో. కేవలం దారిద్ర్యంలో మగ్గుతూ, రోగంతో బాధపడుతూ, చివరి దశలో మంచం మీదే కాలం గడిపిన తండ్రి రూపం ఒకటే తన మనసులో ముద్ర వేసుకుంది. అంతే. జైళ్ళలో మగ్గి మగ్గి ఆయన ఆరోగ్యం అలా పాడయిపోయిందట చివరికి.

ప్రకాశం మాష్టారిని సగౌరవంగా వేదిక మీదికి ఆహ్వానించారు ఉత్సవ కార్యకర్తలు. తండ్రి చిత్ర పటానికి పూల మాలలు వేయడంతోపాటు తనకీ వేశారు. మంత్రిగారు వచ్చి జ్యోతి వెలిగించిన తరువాత లాంఛనప్రాయంగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేదిక మీద ఆసీనులైన ఒక్కొక్కరు లేచి మైకు ముందుకు వచ్చి కేశవరావుగారి త్యాగశీలతనీ, దేశభక్తినీ, సేవా నిరతినీ కొనియాడసాగారు. ఆ సమయంలో అంతటి త్యాగమూర్తి కొడుకై పుట్టినందుకు ప్రకాశం మాష్టారికి ఎంతో గర్వంగా అనిపించింది. అర్థాంతరంగా ఆగిపోయిన తన చదువు సంగతిగానీ, బతకలేక బడిపంతులు ఉద్యోగం చేస్తూ, రోగాలతోనూ, దారిద్ర్యంతోనూ కుటుంబాన్ని అతి కష్టంగా నెట్టుకొస్తున్న సంగతిగానీ, ఆ సమయంలో గుర్తుకు రాలేదు. ఏదో తెలియని పరవశత్వంలో మునిగిపోయారు కాసేపు.

ఉన్నట్టుండి కరతాళ ధ్వనులు పెద్ద పెట్టున వినిపించడంతో ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చారు ప్రకాశం మాష్టారు.

మైకు ముందు నిలబడి ఆవేశంగా చెప్పుకు పోతున్న బాలగంగాధరతిలక్ మాటలు వింటుంటే ఒక్కసారిగా కూర్చున్న భూమి కంపించినట్టనిపించింది ఆయనకి. కళ్ళు బైర్లు కమ్మాయి. గొంతు తడారి పోయి, నాలుక అంటుకుపోయింది. ఇక కుర్చీలో కూర్చోలేక పక్కకు వాలిపోయారు ప్రకాశం మాష్టారు.

బాలగంగాధరతిలక్ ఇంకా చెప్పుకుపోతూనే వున్నాడు-

"కేశవరావుగారు అంత గొప్ప మహానుభావుడూ, స్వాతంత్ర్య యోధుడూ, త్యాగశీలి కాబట్టే ఆయన నివసించిన ఇంటినీ, ఆయన ఉపయోగించిన వస్తువుల్నీ స్మారక చిహ్నాలుగా పదిల పరచాలని కేశవరావు స్మారక కమిటీ ఆలోచించింది. ఆయనగారి కుమారులైన శ్రీ ప్రకాశంగారు కూడా అంతటి త్యాగశీలేననడంలో ఎలాంటి సందేహం లేదు. తాను నివసిస్తున్న ఇంటిని సైతం సంతోషంగా స్మారక కమిటీకి సమర్పించడమే దానికి నిదర్శనం. ఇలా త్యాగం చేసి తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నారు శ్రీ ప్రకాశంగారు."

జనం మళ్ళీ మళ్ళీ చప్పట్లు కొడుతూనే వున్నారు. ఆయన ఇంకా అలా పొగుడుతూనే వున్నాడు.

కానీ ప్రకాశం మాష్టారు మాత్రం అవేవీ వినే స్థితిలో లేరు.

●

